క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో తిరుపతి గంగమ్మ మరుపూజ

కుప్పం: పట్టణంలోని శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర ముగింపు అనంతరం ఆదివారం మరు పూజ ఘనంగా నిర్వహించారు. జాతరలో మొక్కులు చెల్లించుకోలేని భక్తులు, పూజరులు, పట్టణ ప్రజలు మరు పూజల్లో భక్తులు మొక్కులు చెల్లించారు.

అన్నదానానికి రూ.5లక్షల విరాళం



విరాళ చెక్‌ను చైర్మన్, ఈఓకు అందజేస్తున్న బాలాజి దంపతులు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఉచిత అన్నదానం నిర్వహణకు తిరుపతికి చెందిన బాలాజి దంపతులు రూ.5 లక్షల విరాళమిచ్చారు. ఆదివారం చెక్‌ను ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళికి అందజేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి శాలువతో సత్కరించారు. వేదపండితులు ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో బోయకొండ ఆలయ కమిటీ డైరెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లను అదుపులో తీసుకుంటాం

రొంపిచెర్ల: వచ్చే నెల 4వ తేదీ ఓట్ల లెక్కింపును దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ముందస్తుగా రౌడీషీటర్లను, పలు కేసులలో ఉన్న నిందితులను అదుపులో తీసుకుంటామని కల్లూరు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం సీఐ స్థానిక విలేకరులతో మాట్లాడారు. గొడవలు సృష్టించే వారిని గుర్తించి అరెస్టు చేస్తామన్నారు. ఎన్నికల కోడ్, పోలీస్ 30 యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పోలీసులను ఆదేశించారు. అలాగే ఎవరైనా అక్రమంగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు కలిగి ఉన్నా సీజ్ చేయాలన్నారు. ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టించేందుకు యత్నిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

జెడ్పీ చైర్మన్ నివాళి



బాలసుందరం రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్

పలమనేరు: పట్టణానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యులు, సీనియర్ టీడీపీ నాయకులు బాలసుందరం రెడ్డి మృతదేహానికి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదివారం నివాళులర్పించారు. వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతూ శనివారం ఆయన మృతి చెందడం విదితమే. స్థానిక మధు కళాశాలలో ఉంచిన ఆయన మృతదేహానికి పూలమాల వేశారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే, అసోం రాష్ట్ర పర్యటనకు వెళ్లిన మాజీమంత్రి అమరనాథ రెడ్డి సైతం విషయం తెలుసుకుని నేరుగా ఇక్కడికి వచ్చి బాలసుందరం రెడ్డికి నివాళులర్పించారు.

నేడు, రేపు గంగ జాతర



కొత్త శోభను సంతరించుకున్న ఆలయ ప్రాంగణం

వి.కోట: స్థానిక శ్రీ గంగమాంబ జాతర సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కార్తికేయన్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం అమ్మవారికి అభిషేకం, రాత్రి శిరస్సు ఊరేగింపు, పూలగెరిగ, పుష్ప పల్లకి, 28 ఉదయం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశం, అమ్మవారికి అభిషేకానంతరం రాత్రి 9 గంటల వరకు దీపారాధన, అర్ధరాత్రి 12 గంటలకు అమ్మవారి జలధి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. అలాగే 28న మంగళవారం సాయంత్రం 5 గంటలకు మాజీ సర్పంచ్ బసప్ప జ్ఞాపకార్థం ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

విగ్రహ ప్రతిష్ట

నగరి: మున్సిపల్ పరిధిలోని కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయంలో నూతన విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. శ్రీదేవి, ప్రత్యంగర శరభేశ్వరర్, వరాహి, ఇతర పరివార దేవతల విగ్రహాలకు తొలుత సుమంగళులచే కలిపిన పసుపు నీటిలో జలావాసం చేయించారు. ప్రత్యేక పూజలనంతరం విగ్రహాలను బయటకు తీసి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆలయం చుట్టూ ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు హోరెత్తాయి. శివగామి సమేత చంద్రమౌళీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు.

మట్టితో ఇసుక తయారీ!

- వ్యాపారస్తులకు కాసులు కురిపిస్తున్న చెక్‌డ్యామ్‌లు
- సొమ్ము చేసుకుంటున్న ఇసుకాసురులు
- నిద్రావస్థలో రెవెన్యూ, పోలీస్ అధికారులు

గ్రామాలలో మట్టితో ఇసుక తయారీ కేంద్రాలు అధికమయ్యాయి. ఇసుక తయారీకి చెక్‌డ్యామ్‌లను నీటిని విచ్చలవిడిగా వాడుతూ ఇసుకాసురులు కలుషితం చేస్తున్నారు. నాణ్యత లేని ఈ ఇసుకను భవన నిర్మాణాలకు వాడతుండటంతో అవి పనులు పూర్తికాకనే బీటలుబారుతున్నాయి. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన రెవెన్యూ, పోలీస్ అధికారులు నిద్రావస్థలో జోగుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.



మట్టి నుంచి తయారు చేస్తున్న ఇసుక



చెక్‌డ్యామ్‌ను నుంచి మోటార్లతో తోడుతున్న నీరు

గుడుపల్లె: మండలంలోని కనమనపల్లె, యామగానిపల్లె , గుండ్లసాగరం, కుప్పిగానిపల్లె, ఓయన్ కొత్తూరు, సోడిగానిపల్లె, చీకటిపల్లె, శెట్టిపల్లె, పాగురుపల్లె తదితర గ్రామాల్లో మట్టితో ఇసుకను తయారు చేసి విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వ భవనాలు, ఇండ్లు నిర్మించిన పనులు పూర్తి కాకనే బీటలు బారుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, ఉదాశీనత ఇసుకాసురులకు కాసులు కురిపిస్తోంది. లక్షలు వెచ్చించి వర్షపు నీటి నిల్వ చేసేందుకు నిర్మించిన చెరువులు, చెక్‌డ్యామ్‌లు ఇసుక వ్యాపారస్తులకు కాసులపంటగా మిగిలింది.

ఇసుక తయారీ ఇలా..

చెరువులలోని మట్టిని ట్రాక్టర్లలో తరలించి సమీపంలో నీరు ఉన్న చెక్‌డ్యామ్ వద్ద తరలించి, కుప్పలుగా పోసి నిల్వ ఉంచుతారు. చెక్‌డ్యామ్‌కు పైపులు వేసి నీటిని డీజిల్ ఇంజిన్‌తో తోడి మట్టి మీదకు వదులుతారు. దీంతో మట్టి నీటిలో కొట్టుకుపోతుంది. ఇసుక మాత్రం మిగిలిపోతుంది. ఇలా మట్టిలో నుంచి వచ్చిన ఇసుకను తీసి నిల్వ చేస్తారు. మట్టితో కూడిన నీటిని మళ్లీ చెక్‌డ్యామ్‌లో వదలుతున్నారు. ఇలా మట్టి నుంచి ఇసుక తయారీకి చెక్‌డ్యామ్‌లోని నీటిని విచక్షణారహితంగా తోడేస్తుండడంతో నీరు ఖాళీ అయి భూగర్భ జలాల మట్టం పడిపోతోంది.

రూపురేఖలు మారుతున్న చెక్‌డ్యామ్‌లు

వేసవి కాలంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడుతున్న చెక్‌డ్యామ్‌లు ఇసుకాసురుల ధాటికి రూపురేఖలు మారుతున్నాయి. మట్టి నుంచి తయారు చేసిన ఇసుకను ప్రభుత్వ భవనాలకు, ఇళ్ల నిర్మాణానికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కానీ ఈ ఇసుకను నిర్మాణాలకు వాడితే వాటి నాణ్యత ప్రమాణాలు ఉండక దెబ్బతింటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులు, చెక్‌డ్యామ్‌లలో తయారు చేస్తున్న ఇసుక తయారీ కేంద్రాలపై దాడులు చేసి, నిర్వాహకులకు చర్యలు తీసుకుని, పశువులకు దాహార్తి తీర్చేందుకు ఉపయోగపడేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మట్టి నుంచి తయారు చేసిన ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

అధికారుల కళ్లెదుటే అక్రమ రవాణా

నిత్యం ఉదయం,సాయంత్రం సమయాలలో ఫిల్టర్ ఇసుక ట్రాక్టర్లలో వెళుతున్నా కూడా రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకున్న పాపానపోవడం లేదు. చెరువులో తీస్తున్న మట్టికి ఇరిగేషన్ శాఖకు చలాన్ కట్టాలి. అలాగే ఇసుక ట్రాక్టర్‌కు తరలించాలంటే టన్నుకు చలాన్ కట్టాలి . కానీ ఎలాంటి రుసుము కట్టకుండా తరలిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది.

అశ్వ వాహనంపై శ్రీవారి విహారం



అశ్వవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

సదుం: మండలంలోని బూరగమందలో భూదేవి శ్రీదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అశ్వవాహనం ఉత్సవమూర్తులు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో తొలుత ఉదయం అభిషేకాలు, విశేషాలంకారం, ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి మేళతాళాలతో ఘనంగా అశ్వ వాహన సేవ నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సంకటహర చతుర్దశి పూజలు

పలమనేరు: సంకట హర చతుర్దశి పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో బసవన్నకట్టవీధిలోని శ్రీబసవేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

వైఎస్సార్ సీపీని ఆశీర్వదించు జగన్మాతా!

- మళ్లీ సీఎంగా జగన్ ప్రమాణ స్వీకారం చేయాలని వేళాంగణిలో ప్రార్థనలు

రామకుప్పం: ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని, ముఖ్యమంత్రిగా రెండోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయాలని మండలంలోని 89 పెద్దూరు సర్పంచ్ మల్లిక, ఆమె భర్త గోవిందప్ప కుటుంబ సభ్యులతో కలసి తమిళనాడులో ప్రసిద్ధి గాంచిన వేళాంగణిలో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెండు కిలోమీటర్లు మోకాళ్లతో నడిచి చర్చి వద్ద ప్రార్థనలు చేశారు. వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో అట్టడుగు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మంచి చేయడం కోసం జగన్‌మోహన్ రెడ్డి మరోసారి సీఎం కావాలన్నారు.



మోకాళ్లపై నడుస్తున్న సర్పంచ్ మల్లిక, కుటుంబ సభ్యులు

పోలీసుల కార్డన్ సెర్చ్

- రెండు బైక్‌లు స్వాధీనం



పోలీసులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణారెడ్డి

సదుం: వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్, నిబంధనలు పాటించాలని ప్రజలను సీఐ కృష్ణారెడ్డి కోరారు. ఆదివారం ఎస్‌ఐ షేక్‌షావలితో కలిసి మండలంలోని పలు గ్రామాలలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. బూరగమంద, చీకలచేను, గాదేవారిపల్లె, సీఎం గొల్లపల్లె తదితర గ్రామాల్లో తనిఖీలు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. సరైన పత్రాలు లేని రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

సారా బట్టీలపై దాడులు



పుంగనూరు: సారా బట్టీలపై పోలీసులు దాడులు చేశారు. సారా ఊట ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాఘవరెడ్డి కథనం..ఎస్‌ఐలు సుబ్బారెడ్డి, మహమ్మద్ రఫితో పోలీసులు ఆదివారం మండలంలోని నల్లగుట్లపల్లెతాండాలో దాడులు చేశారు. సుమారు వెయ్యి లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. అలాగే సుమారు రూ.1.50 లక్షల విలువ చేసే వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడైనా సారా తయారు చేస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారమివ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పలమనేరు: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కుప్పం పీఈఎస్ వైద్యులు ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. 1968లో ఇక్కడ ఎస్‌ఎస్‌ఎల్‌సీ చదివిన అప్పటి విద్యార్థులు సహకారంతో ఈ శిబిరం నిర్వహించారు. దాదాపు 150మందిని వైద్యులు పరీక్షించారు. వీరిలో తొమ్మిది మందిని కంటి శస్త్రచికిత్స కోసం ఎంపిక చేసినట్టు లయన్స్ క్లబ్ నిర్వాహకులు రఘు, వీరభద్ర తెలిపారు. శిబిరంలో పీఈఎస్‌కు చెందిన పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



పలమనేరులో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం: డీఎస్పీ



89 పెద్దూరు గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనాథ్

-89 పెద్దూరులో పోలీసుల కవాతు

రామకుప్పం: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదని కుప్పం డీఎస్పీ శ్రీనాథ్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని 89 పెద్దూరులో పోలీసు కవాతు నిర్వహించారు. అనంతరం డీఎస్పీ గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు. శుక్రవారం రాత్రి గ్రామంలో జరిగిన ఘటనపై ప్రజలు సంయమనం పాటించాలన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఉద్దేశపూర్వకంగా అల్లర్లు, గొడవలు సృష్టించినట్లయితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చిన్నపాటి గొడవలు తలెత్తిన స్థానిక పోలీస్‌స్టేషనుకు సమాచారమివ్వాలని కోరారు. కార్యక్రమంలో కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్ రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బాట గంగమ్మ జాతర

పెద్దపంజాణి: మండలంలోని బసవరాజు కండ్రిగలో ప్రతి ఏటా నిర్వహించే బాట గంగమ్మ జాతరను గ్రామస్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారి శిరస్సు మెరవణి శనివారం అర్ధరాత్రి గ్రామ చివరన ఉన్న కాటమరాజుల గుడి వద్ద ప్రారంభమైంది. మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో సాగి గ్రామంలోని అమ్మవారి మండపంలో ఆశీనులు చేశారు. ఊరేగింపులో ఇంటింటా అమ్మవారి శిరస్సుకు హారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి, మొక్కులు చెల్లించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గంగవరం సీఐ కృష్ణమోహన్ అధ్వర్యంలో పెద్దపంజాణి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. రెండు రోజుల గంగమ్మ జాతర సోమవారం ఉదయం జలధితో పరిసమాప్తమవుతుంది. అమ్మవారి విశ్వరూప దర్శనం అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ శివారులో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.



అమ్మవారి విశ్వరూప దర్శనం

వైభవంగా ద్రౌపదీ ధర్మరాజుల రథోత్సవం



రథోత్సవంలో భక్తులు

గుడుపల్లె: మండలంలోని యామగానిపల్లెలో నిర్వహిస్తున్న మహా భారత మహోత్సవాలలో భాగంగా ఆదివారం ద్రౌపదీ ధర్మరాజుల రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద రథాన్ని పచ్చతోరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రథంపై ద్రౌపదీదేవిని కొలువుదీర్చారు. మంగళ వాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయానికి ఫర్లాంగు దూరంలోని గుడిసత్రం వద్ద అర్జునుడు, ఉత్తర కుమారుని వేషధారులు రథంపైకి చేరుకున్నారు. గుడిసత్రం వద్ద పరిసర గ్రామస్తులు పశువులను తీసుకునవచ్చారు. ఆ పశువులకు జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు, అనంతరం ఆవులతో 'ఉత్తర గోగ్రహణం' కార్యక్రమాన్ని అర్జున వేషధారి నిర్వహించారు. ఆలయం వద్ద పశువులను పరుగులు తీయించారు. రథోత్సవం, ఉత్తర గోగ్రహణం కార్యక్రమాలకు తిలకించేందుకు భక్తులు విశేషంగా తరలి వచ్చారు. సోమవారం ఆలయం ఆవరణలో ఇలావంతుని బలి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.




పరుగులు తీస్తున్న పశువులు

పిట్ట కొంచెం.. కూత ఘనం

-ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

గుడుపల్లె: పిట్ట కొంచెం..కూత ఘనం- అనే సామెత ఇదిగో ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న పాలబుగ్గల చిన్నారికి అతికినట్లు సరిపోయింది. వయసేమో ఏడాదిన్నరే. కానీ జ్ఞాపకశక్తిలో అసమాన్య ప్రతిభ ఈ చిన్నారి సొంతం. ఫలితంగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకుంది. వివరాలు..మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న లక్ష్మీ వరప్రసాద్, అశ్రిత దంపతుల కుమార్తె భవితకు ఏడాదిన్నర వయసు. తమ కుమార్తెకు జ్ఞాపకశక్తి, గ్రాహ్యక శక్తి బాగా ఉన్నట్లు గుర్తించిన తల్లిదండ్రులు కొన్ని విషయాల్లో రాటుదేలేలా నేర్పించారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన 2024 ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ పోటీలలో భవిత పాల్గొంది. భారత దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానులు ఎ నుంచి జెడ్ వరకు అక్షరాలు కూడిన పదాలు, రైమ్స్ సంఖ్యలు, జాతీయ చిహ్నాలు, వారం రోజుల పేర్లు అతి తక్కువ సమయంలో చెప్పడంతో రికార్డును కైవసం చేసుకుంది. ఈ చిన్నారి దీంతో పాటు 40 దేశాల రాజధానుల పేర్లను కూడా చెప్పింది. ఆదివారం రికార్డు సర్టిఫికెట్ వారి ఇంటికి చేరింది.



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌తో భవిత

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం





విశేషాలంకారంలో వీరబ్రహ్మేంద్రస్వామి, బొమ్మాయిపల్లెలో స్వామివారి గ్రామోత్సవం

బంగారుపాళెం: మండలంలోని బొమ్మాయిపల్లెలో శనివారం రాత్రి శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఆలయంలో వార్షికోత్సవ పూజలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చివరి రోజు స్వామి మూల విగ్రహానికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కల్యాణమహోత్సం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారి వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు.